క్లుప్తంగా

లక్ష్మీనరసింహ స్వామికి పూజలు



హైకోర్టు జడ్జి గుణరంజన్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రెడ్డి

తాడిపత్రి రూరల్: మండలంలోని చల్లవారిపల్లిలో ఉన్న లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని హైకోర్టు జడ్జి గుణరంజన్ బుధవారం కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు జడ్జిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రత్యేక పూజల అనంతరం ప్రసాదం అందజేశారు. అంతకు ముందు చల్లవారిపల్లి గ్రామంలో బంధువులతో కలసి సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు.

సన్మానం..

హైకోర్టు జడ్జి గుణరంజన్‌ను బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, టెక్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ రమేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో ఘనంగా సన్మానించారు.

పరామర్శ



కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు భోగతి నారాయణరెడ్డి

యల్లనూరు: మండలంలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణారెడ్డి భార్య శారద (38) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భోగతి ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకుడు భోగతి నారాయణ రెడ్డి, నియోజకవర్గ నాయకుడు ఎర్రిస్వామిరెడ్డి, మండల నాయకుడు కల్లూరు ప్రతాప్‌రెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, టీడీపీ నేత బీటెక్ రవి తదితరులు కృష్ణారెడ్డిని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సినీ నటుడు ఎస్వీ ప్రసాద్ యాదవ్‌కు నివాళి

గుంతకల్లు: స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం సినీ నటుడు ఎస్వీ ప్రసాద్ యాదవ్ వర్ధంతిని జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటా ప్రధానం చేసే ఎస్వీ ప్రసాద్ యాదవ్ సార్థక అవార్డులు అందజేశారు. ఏపీ రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ అమ్లేట్ మస్తాన్ యాదవ్ మాట్లాడుతూ.. పలు సినిమాల్లో నటించి దిగ్గజాలచే ప్రశంసలు పొందిన ప్రసాద్ యాదవ్ పాత్రలకు మరణం లేదన్నారు. అనంతరం రంగస్థల కళాకారులు జబీవుల్లా, ఆంథోని, బి.మస్తాన్, గోవిందు తదితరులకు సార్థక అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్, మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజి, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు రాముడు, చలపతి, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న క్రీడాపోటీలు



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని డీవైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం సీఐటీయూ, తిలక్‌నగర్ ఏరియాల్లో పిల్లలు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో తదితర పోటీలతో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి, డీవైఎఫ్ఐ కార్యదర్శి సురేంద్ర, ఐద్వా కార్యదర్శి రంగమ్మ, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీ జ్యోతుల మహోత్సవం



జ్యోతులతో నృత్యం చేస్తున్న భక్తులు

యాడికి: మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున చౌడేశ్వరీ దేవి జ్యోతుల మహోత్సవాన్ని తొగటవీర క్షత్రియుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 22 ఏళ్ల తర్వాత గ్రామంలో నిర్వహించిన చౌడేశ్వరీ దేవి జ్యోతుల మహోత్సవానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. చౌడేశ్వరీ దేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి, పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. బస్టాండు సమీపంలో ఉన్న చౌడమ్మ రచ్చకట్ట వద్ద భక్తులు జ్యోతులను తలపై పెట్టుకుని నృత్యాలు చేశారు. పురవీధుల్లో భక్తిగీతాలు ఆలపిస్తూ చౌడేశ్వరీ ఆలయానికి చేరుకున్నారు.

సంప్రదాయ పంటలకు స్వస్తి..

పొగాకు సాగుకు ఆసక్తి

పుట్లూరు మండలం శనగలగూడూరు రైతులు సంప్రదాయ పంటలకు స్వస్తి పలుకుతున్నారు. ఏటా రబీ సీజన్‌లో పప్పుశనగ సాగు చేసే అన్నదాతలు.. ఈసారి పొగాకు సాగుకు ఆసక్తి చూపారు. పప్పుశనగకు తెగుళ్ల సోకడం, రసాయన మందుల ఖర్చు పెరగడం, దిగుబడి తగ్గడంతో రైతన్నలు విసిగిపోయారు. పొగాకు సాగు చేసి లాభాలు ఆర్జించవచ్చని భావిస్తున్నారు.



శనగలగూడూరు వద్ద సాగు చేసిన పొగాకు



కోతల అనంతరం పొగాకును ఆరబెడుతున్న రైతులు

- శనగలగూడూరులో పొగాకు సాగు చేసిన రైతులు
- సుమారు 80 ఎకరాల్లో 'చుక్కబర్లీ' పొగాకు సాగు

పుట్లూరు: నాణ్యమైన నల్లరేగడి భూములు ఉన్న శనగలగూడూరు గ్రామంలో ప్రతి ఏడాది రబీ సీజన్‌లో అత్యధికంగా పప్పుశనగ సాగవుతుంది. వర్షాధారంగా పప్పుశనగ సాగు చేసే రైతుల్లో కొందరు ఈ ఏడాది ప్రత్యామ్నాయ పంటగా పొగాకు సాగు చేశారు. పొగాకు పంట ఆశాజనకంగా ఉండటంతో ఇప్పటికే రెండు విడతల్లో కోతలు పూర్తయ్యాయి. ఆశించిన మేరకు లాభాలు వస్తున్నాయి. నియోజకవర్గ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామంలో దాదాపు 80 ఎకరాల్లో పొగాకు పంట సాగు చేయగా.. ప్రస్తుతం రెండు కోతలు పూర్తయినట్లు రైతులు చెబుతున్నారు.

ఎలా సాగు చేశారంటే..

పొగాకు సాగు చేసుకోవాలని ఓ ప్రైవేట్ కంపెనీ గ్రామంలోని రైతులకు అవగాహన కల్పించింది. ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని భావించిన పలువురు రైతులు పొగాకు సాగుకు ముందుకొచ్చారు. ఇక్కడి రైతులు 'చుక్కబర్లీ' రకానికి చెందిన పొగాకు సాగు చేయడం కోసం కంపెనీ నుంచి కిలో విత్తనాలు రూ.1000 ప్రకారం కొనుగోలు చేసి నారు పోసుకున్నారు. కిలో విత్తనాలతో వేసిన నారు సక్రమంగా మొలక వస్తే దాదాపు 100 ఎకరాల్లో నాట్లు వేసుకోవచ్చు. ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు పెట్టుబడి అవసరం అవుతుంది. ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నారు. క్వింటాల్ పొగాకు రూ.15 వేలకు పొగాకు కంపెనీ కొనుగోలు చేయడంతో రైతులకు మంచి ఆదాయం లభిస్తోంది. పంట కాలం 4 నుంచి 5 నెలలు కాగా.. 80 నుంచి 90 రోజుల మధ్యలో మొదటి కోత ప్రారంభం అవుతుంది. పొగాకు ఒకసారి సాగు చేస్తే నాలుగు నుంచి ఐదు కోతలు వస్తాయని రైతులు పేర్కొంటున్నారు.

ఆకులను తోరణాలుగా కట్టి ఎండబెట్టాల్సిందే

పండించిన పొగాకును తప్పనిసరిగా తోరణాలు కట్టి ఎండబెట్టాలి. ఆకులు నాణ్యతగా ఉండటం కోసం పెద్ద ఇనుప కడ్డీతో పురి కోసకు ఆకులను గుచ్చి కట్టెలకు వాటిని కట్టి ఆరబెడుతారు. ఈ సమయంలో ఇతర ప్రాంతాల నుంచి కూలీలను రప్పించుకున్న రైతులు వారి సహాయంతో పొగాకును ఆరబెట్టడంలో మెలకువలను నేర్చుకుంటున్నారు. తద్వారా భవిష్యత్తులో పొగాకు పంట మండలంలో మరింతగా విస్తరించే అవకాశం ఉంది.

14 ఎకరాల్లో సాగు చేశా



ప్రతి ఏడాది పప్పుశనగను సాగు చేసేవాళ్లం. ఈ ఏడాది ప్రత్యామ్నాయ పంటగా పొగాకును 14 ఎకరాల్లో సాగు చేశా. ఇక్కడి నల్లరేగడి భూముల్లో పొగాకు పైరు ఏపుగా పెరిగి నాణ్యమైన ఆకులు దిగుబడికి వచ్చాయి. ఎకరాకు రూ.70 వేల వరకు పెట్టుబడి పెట్టడం జరిగింది. పెట్టుబడి పోనూ ఆశించిన స్థాయిలో ఆదాయం లభించే అవకాశం ఉంది. పంటను సాగు చేయడం కంటే పండించిన పొగాకును ఆరబెట్టడం చాలా కష్టమైన పని.

– రామాంజులరెడ్డి, శనగలగూడూరు

సాగు పెరిగే అవకాశం



ఈ ఏడాది కొత్తగా పొగాకు పంటను మా గ్రామంలో దాదాపు 80 ఎకరాల్లో సాగు చేశారు. పొగాకు కంపెనీ వారు నిర్ణయించిన ధర మేరకు రైతుల నుంచి కొనుగోలు చేస్తారు. రైతులకు అనుకున్న మేరకు ఆదాయం లభిస్తోంది. రసాయన ఎరువులు, మందుల వినియోగం కూడా ఇతర పంటలతో పోలిస్తే తక్కువగానే ఉంది. ప్రస్తుతం క్వింటాల్ రూ.15,500 ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది ఎక్కువగా పొగాకు పంటను సాగు చేశారు. ప్రస్తుతం బోరుబావుల కింద మరో 20 ఎకరాల్లో పొగాకు సాగులో ఉంది.

– గోపాల్‌రెడ్డి, శనగలగూడూరు

రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు దుర్మార్గం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్

గుంతకల్లు: ఫిబ్రవరి 1 నుంచి పెంచుతున్న భూమి విలువ, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపును వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో భూమి విలువ-రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుదలపై పట్టణంలోని పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంతకల్లులో ఏయే ప్రాంతాల్లో అధిక రిజిస్ట్రేషన్ ధరలు ఉన్నాయి? ఏ ప్రాంతాల్లో తక్కువగా ఉన్నాయి? మరలా 15 శాతం పెంచితే అది సమజసంగా ఉంటుందా అనే అంశాలపై చర్చించారు. అనంతరం జగదీష్ మాట్లాడుతూ.. వచ్చే నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూమి విలువ, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతున్నట్లు తెలిపారు. దీనిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆర్‌డీఓ కార్యాలయం, రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో ఈ నెలాఖరు లోపు తెలపన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగాయన్నారు. దీంతో పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోయిందన్నారు. దీంతో పట్టణ అభివృద్ధి కుంటుపడిందన్నారు. భూమి విలువ, రిజిస్ట్రేషన్ చార్జీలను తగ్గించాలని ఆర్‌డీఓ, తహసీల్దార్, రిజిస్ట్రేషన్ అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోదా రంగనాథస్వామి కల్యాణం



గోదాదేవి రంగనాథస్వామికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

తాడిపత్రి అర్బన్: గోవింద నామస్మరణ మధ్య గోదాదేవి రంగనాథస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. రెడ్డివారిపాలెంలోని కోదండ రామస్వామి ఆలయంలో మంగళవారం ధనుర్మాసం ముగింపు సందర్భంగా స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్యాహ్నం 12 గంటలకు వేదపండితుల సమక్షంలో కల్యాణం జరిపించారు. భక్తులు వివిధ రకాల పండ్లు, కానుకలను ప్రత్యేకంగా తయారు చేసిన పిండి వంటలను తీసుకువచ్చి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం చుట్టూ ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రాత్రికి తోటోత్సవం నిర్వహించారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



గెలుపొందిన వారికి నగదు అందజేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండల పరిధిలోని పాత కల్లూరులో మకర సంక్రాంతి సందర్భంగా మంగళవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 34 జట్లు పాల్గొన్నాయి. పాత కల్లూరుకు చెందిన యువకులు మొదటి స్థానం, పాత కల్లూరుకు చెందిన మరో జట్టు రెండవ స్థానం, కదిరిపల్లికి చెందిన జట్టు మూడవ స్థానం, యర్రగుంట్లకు చెందిన జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన వారికి వరుసగా మొదటి బహుమతిగా రూ.8 వేలు, రెండవ బహుమతిగా రూ.5 వేలు, మూడవ బహుమతిగా రూ.3 వేలు, నాలుగో బహుమతిగా రూ.1000 చొప్పున నగదు అందజేశారు. అలాగే క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు భోజన సదుపాయం కల్పించారు.

పూర్వ విద్యార్థుల సందడి



సమావేశమైన పూర్వ విద్యార్థులు

పుట్లూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులంతా ఒకచోట చేరడంతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. దాదాపు 20 సంవత్సరాల అనంతరం కలవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు. ఎంఈఓ శ్రీదేవి, రిటైర్డ్ ఎంఈఓ మాధవ, రిటైర్డ్ హెచ్‌ఎం వెంకటప్రసాద్, ఉపాధ్యాయులు శ్రీదేవి, పద్మానాభయ్య, శ్రీనివాసులు, జగదీశ్వర రెడ్డి, పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

గుంతకల్లుటౌన్: రెడ్‌డ్రాప్ రక్తదాతల సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రెహమాన్ జన్మదినం సందర్భంగా బుధవారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రెహమాన్ 133వ సారి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. ఈయనతో పాటు పలువురు రక్తదాతలు రక్తదానం చేశారు. బ్లడ్‌బ్యాంక్‌లే తమకు దేవాలయాలని రెహమాన్ పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారికి యువతీ, యువకులు రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌డ్రాప్ సంస్థ అధ్యక్షుడు గులామ్ మహ్మద్, సభ్యులు గౌస్, ఇసాక్, వివిధ రక్తదాత సంస్థల ప్రతినిధులు రంజాన్, తిప్పన్న, పురుషోత్తం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

గుత్తి: పట్టణంలోని కొండపై మంగళవారం రాత్రి లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కమిటీ సభ్యులు, స్వామి మాలధారులు, భక్తులు రథాన్ని లాగారు. కొండ వద్ద నుంచి పట్టణంలోని పురవీధుల గుండా రథోత్సవం నిర్వహించారు. జై లక్ష్మీనరసింహస్వామి అంటూ నినాదాలు చేశారు. భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

సందడిగా ముగ్గుల పోటీలు



నగదు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

శింగనమల: మండల కేంద్రంలోని రామాలయంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. యువతులు, మహిళలు ఉత్సాహంగా తరలివచ్చి పోటాపోటీగా రంగవల్లులు వేశారు. గార్లదిన్నె ప్రియాంకకు మొదటి బహుమతిగా రూ.5 వేలు, సుగుణకు రెండో బహుమతిగా రూ.2,500, కమలకు మూడో బహుమతిగా రూ.1,000 నగదు బహుమతులను వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగులగుడ్డం వెంకటరాముడు అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు.

సంక్రాంతి వేడుకలు



అలంకరణలో రంగనాథుడు

గార్లదిన్నె/పుట్లూరు/యల్లనూరు/గుత్తి రూరల్/పామిడి: గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాలోని ప్రజలు మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండుగను జరుపుకున్నారు. ఇళ్ల ముందు రంగవల్లులు వేసి గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేయించారు. పలు ఆలయాల్లో భక్తులకు ప్రసాదం అందజేశారు.

సంక్షిప్త సమాచారం

వెండి కిరీటం వితరణ

యల్లనూరు: స్థానిక చెరువుకట్ట సమీపంలో ఉన్న చౌడేశ్వరీ దేవికి యల్లనూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ శంకర్ దంపతులు వెండి కిరీటం, కళ్లు, బొట్టు, మీసాలను అందజేశారు. రూ.50 వేలు వెచ్చించి వెండి ఆభరణాలను చేయించినట్లుతెలిపారు.

వివాహానికి ఆర్థికసాయం

శింగనమల: మండలంలోని తరిమెల గ్రామానికి చెందిన మహబూబ్ బాషా కుమార్తె వివాహానికి కంచిరెడ్డి ఫౌండేషన్ ద్వారా బుధవారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కంచిరెడ్డి సుధ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కంచిరెడ్డి కృష్ణారెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

తాడిపత్రి అర్బన్: సీపీఐ శత వార్షికోత్సవాలను పురస్కరించుకుని బుధవారం కామ్రేడ్ రంగప్ప స్థూపం వద్ద సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.రంగయ్య తదితరులు నివాళులర్పించారు. పలువురు పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఏ.నాగరంగయ్య, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, ఓబులేసు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'సజ్జ మొలక ఉత్సవాలు'

పామిడి: పట్టణంలోని పెద్ద విఠోబ దేవాలయంలో మంగళవారం సాయంత్రం డబ్బేదార్ ఫిర్కా ఆధ్వర్యంలో సజ్జ మొలక ఉత్సవాలు నిర్వహించారు. రుక్మిణీ పాండురంగ స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. తరతరాల భారతీయ సంస్కృతికీ ప్రతీకగా ఈ ఉత్సవాలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా మారింది. కొత్త సజ్జల మొలకలు, కొత్త బెల్లం ముక్కలు, వేరుశెనగ పప్పు, జీడీ పప్పు, సోపు ఇలా రకరకాల దినుసులు కలిపి కలుదైవం రుక్మిణీ పాండురంగస్వామికి నివేదన చేస్తారు. స్వామికి అర్చకులు పూజలు చేసిన అనంతరం మొలకలను భక్తులకు అందజేశారు. శ్రీనివాసరావు, రాజశేఖర్‌రావు, అడ్వకేట్ దత్తు, ముకుందా, సాయి పాల్గొన్నారు.

అనారోగ్యంతో బసినేపల్లి తండా ఉప సర్పంచ్ మృతి

గుత్తి రూరల్: బసినేపల్లి తండా ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు ముడావత్ సీతమ్మ (54) అనారోగ్య సమస్యలతో బుధవారం మృతి చెందారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ముడావత్ శ్రీరాములు నాయక్ భార్య గ్రామ ఉప సర్పంచ్ ముడావత్ సీతమ్మ గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేది. తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ కోలుకోలేక మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. సర్పంచ్ సుశీలమ్మ, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు లాలునాయక్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నేడు టెంకాయల విక్రయ హక్కులకు వేలం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో ఫిబ్రవరి 6 నుంచి 14 వరకూ మాఘమాసంలో జరిగే రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు (తిరునాల) సందర్భంగా ఆలయ ఆవరణలో టెంకాయల విక్రయానికి గురువారం ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నాగేంద్రుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాల టెంకాయల వేలం పాటతో పాటుగా ఫిబ్రవరి 15 నుంచి 2026 పుష్యమాసం నెలాఖరు వరకూ ఏడాది పాటు టెంకాయల విక్రయానికి మధ్యాహ్నం 12 గంటలకు వేలం పాట ఉంటుందని పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు దేవాలయ అధికారి వద్ద రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

గుండెపోటుతో కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌కు చెందిన విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగి రవూఫ్ (58) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. వివరాలు.. గుత్తి ఏపీఎస్‌పీడీసీఎల్‌లోని పెద్దవడుగూరు సెక్షన్‌లో కాంట్రాక్ట్ విద్యుత్ ఉద్యోగిగా పని చేస్తున్న రవూఫ్ పని మీద గుత్తి–వెంకటాంపల్లి గ్రామానికి వెళ్లాడు. అయితే అక్కడ అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో కుప్పకూలి చనిపోయారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. రవూఫ్ మృతికి విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు సంతాపం ప్రకటించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పోటాపోటీగా ఇరుసు పందెం పోటీలు



విజేతలకు నగదు అందజేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండల పరిధిలోని పాత కల్లూరులో కనుమ పండుగ సందర్భంగా బుధవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఇరుసు పందెం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 9 మంది యువకులు ఇరుసు పందెం పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలు తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పాత కల్లూరుకు చెందిన మణి మొదటి స్థానం, ఎర్రగుడికి చెందిన రమేష్ రెండవ స్థానంలో నిలిచారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.1,500, రెండవ బహుమతిగా రూ.1000 నగదు అందజేశారు.

ఆలూరులో గ్రామోత్సవం



విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

తాడిపత్రి రూరల్: మండలంలోని ఆలూరు గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భూదేవి, శ్రీదేవి సమేత రంగనాథ స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల పంచలోహ విగ్రహాలను ఆలూరు కోన నుంచి అర్చకులు ఆలూరు గ్రామానికి తీసుకువచ్చారు. విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. గ్రామోత్సవంతో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి, అమ్మావార్లను దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జెర్సీల వితరణ

గుత్తి: పట్టణంలోని ఫుట్‌బాల్ క్రీడామైదానంలో బుధవారం బండగేరికి చెందిన ఆర్‌బీ శశి భార్గవ్ 20 మంది ఫుట్‌బాల్ క్రీడాకారులకు ఉచితంగా జెర్సీలను అందజేశారు. ఈ సందర్భంగా దాత ఆర్‌బీ శశి భార్గవ్ మాట్లాడుతూ.. తండ్రి ఆర్‌బీ కమలాకర్ జ్ఞాపకార్థం సుమారు రూ.15 వేలు విలువైన జెర్సీలను క్రీడాకారులకు పంపిణీ చేశామన్నారు. భవిష్యత్‌లో కూడా క్రీడాకారులకు సహాయంగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, కోచ్‌లు ప్రసాద్, శీనా, రవి, మహేష్, దాదా తదితరులు పాల్గొన్నారు.